# రోగి కోరిందీ పాలే - వైద్యుడు యిచ్చిందీ పాలే

"నీకేమీ జబ్బులేదోయ్" డాక్టరు భుజం తట్టి అన్నాడు "అనవసరమైన టెన్షన్‌లు పెట్టుకోకు".

నేను ఆశ్చర్యముగా చూసాను, డాక్టరుని , కళ్ళు తిరుగుతున్నట్లు అనిపిస్తోంది. చాలా నీరసంగా వుంది. నడవలేకపోతున్నాను. జబ్బేమి లేదని చెప్తున్నాడేమిటి, ఇతను!

డాక్టర్ నా ఆలోచన అర్థం చేసుకున్నట్లున్నాడు. నెరసిపోయిన కనురెప్పలు ముడుస్తూ అన్నాడు. " రక్తపోటు కొద్దిగా ఎక్కువ ఏమోననే అనుమానం ఉంది. చూద్దాం నువ్వు ఖాళీయేకదా? కాస్సేపు కూర్చో నేను నీతో కొన్ని విషయాలు మాట్లాడాలి". అతను మరో రోగివైపు తిరిగాడు.

డాక్టర్ గదిలో నుంచి బయటకు వచ్చాను నేను రోగుల అంతగా లేరు. డాక్టర్ ఖాళీగా వున్నట్టే లెక్క అలాంటి రోజుల్లో నేను వెళితే కాస్సేపు కులాసా కబుర్లు చెప్పుకోవటం అతనికి అలవాటు, ఎందుకంటే అతను మావూరివాడు, స్నేహితుడు.

కిటికీ ఎదురుగా వున్న సోఫాలో కూర్చున్నాను. తెల్లమబ్బులతో, నెరసిపోయిన ఆకాశం జీవితపు సాయం సంధ్యని దాటుతున్న నా ప్రతిబింబములా కనబడింది, సూర్యుడు ప్రసరించిన వెలుగుని అందుకొని సూర్యుని వెనక్కు నెట్టివేసి వెన్నెల నవ్వుతో ఉదయించే, బాలచంద్రుడు మా కర్మాగారములోని కార్మిక నాయకుడిని గుర్తుకి తెచ్చాడు.

అతడు గుర్తు రాగానే గుండె గబగబకొట్టుకుంది. రక్తపోటు కొద్దిగా పెరిగింది. కళ్ళు ఎర్రబడి, చేతులు వణికాయి.

అతను ఎదురుగా వుంటే పచ్చిగా కొరికితినే వాడిని కానీ, అతడు కొరకరాని కొయ్య! నా గొంతులోని పచ్చివెలక్కాయ!

ఉద్యోగుల సంక్షేమ సంబంధాల అధికారిగా, నాకున్న ముప్పది సంవత్సరాల అనుభవాన్ని నైపుణ్యాన్ని ముప్పతిప్పలు పెడుతున్న సమర్థుడు!

కార్మికులతో ఒప్పందం కుదుర్చుకోటానికి నేను వేసే శత సహస్ర అస్త్రాలకు ,

రక్షణగా నిలచిన కంచు కవచం!

గట్టిగా నిట్టూర్చి కళ్ళు మూసుకున్నాను.

కళ్ళు మూసుకున్నానో లేదో మా ఎమ్.డి. కళ్ళల్లో మెదిలారు.

" చూడండీ మిస్టర్ రావు" ఊరిలోకి రాగానే అడిగాడు ఎమ్.డి. "కార్మికులతో ఒప్పందం ఎంతవరకూ వచ్చింది".

" ప్రయత్నిస్తున్నాను సార్"

" ఇంకా ప్రయత్నిస్తూనే వున్నారా. వెరీ, వెరీ బేడ్" అతని గొంతులో అసంతృప్తి ప్రస్ఫుటంగా గోచరించింది. " పాత ఒప్పందం కాల దోషం పట్టి సంవత్సరము గడిచిపోయింది."

"నిజమే సార్" నేను మెల్లగా గొణిగేను. " అన్ని విషయాల్లోనూ ఒప్పందం కుదిరినట్టే గానీ....."

"గానీ....."

"ఒక్క ప్రమోషన్ విషయంలోనే ఒప్పందానికి రాలేకపోతున్నాం. పది సంవత్సరరాల సర్వీసు పూర్తి చేసిన ప్రతీ ఒక్కరినీ సూపర్ వైజర్ చెయ్యాలని పట్టుబడుతున్నారు సార్"

"మీరేమనుకుంటున్నారు"?

" ఖాళీలు లేనప్పుడు యిందరికి ప్రమోషన్లిస్తే....."

ఎమ్.డి. ఏమీ అనలేదు. బల్లమీదకు ఒంగి ఏవో కాగితాలు చూస్తూ కూర్చున్నారు.

నిమిషాలు గడిచిపోయాయి.

"పని చెయ్యని ఈ ట్యూబ్‌లైట్స్‌ని మార్చమని చెప్పవయ్యా" కాగితాలమీద నుంచి దృష్టిమళ్ళించిన ఎమ్.డి. వెలిగి, ఆరిపోతున్న ట్యూబ్‌ని చూసి అన్నారు. "ఈట్యూబ్ పని అయిపోయినట్లుంది".

మళ్ళీ యిద్దరి మధ్యన నిశ్శబ్దం! అక్కడ వుండాలో, బయటకు రావాలో నాకు

అర్థం కాలేదు.

" చూడండి మిస్టర్ రావు" ఎమ్.డి. ఆలోచిస్తూ అన్నారు. "మీకు మరో మూడు నెలలు గడువు యిస్తున్నాను. ఆలోగా ఒప్పందం అయిపోవాలి" బల్ల మీద నున్న గ్లోబ్‌ని తిప్పుతూ అన్నారు ఎమ్.డి.

బరువుగా బయటకు వచ్చాను. చదువుకున్న ప్రశ్నలలో ఒక్కటి కూడా పరీక్ష పేపర్లో కనబడని విద్యార్థిలా వుంది, నా పరిస్థితి.

ఎంతసేపు అలా కూర్చున్నానో తెలియదు. హఠాత్తుగా కళ్ళు తెరచి చూసేను. ఎదురుగా గోడమీద నున్న గడియారం ఆగిపోయివుంది.

డాక్టరు గదిలో నుంచి మాటలు వినిపిస్తున్నాయి.

"ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకోవటం లేదండీ, డాక్టర్‌గారూ" ఒక ఆమె గొంతు. "బంగాళాదుంపల వేపుడు తింటానంటారు"

"రోజూ ఆకుకూరలు తిని, తిని విసుగు వచ్చేసిందండీ, ఒక్కరోజు దుంపకూర తింటే తప్పా?"

"తప్పే" ఆమె గట్టిగా అంది "మధుమేహ వ్యాధితో బాధపడుతూ దుంపకూర తినటమేమిటి?" వాళ్ళిద్దరూ గట్టిగా వాదించుకుంటున్నారు.

"అతను అంతమొండి పట్టుదలతో వున్నప్పుడు ఏం చేస్తావమ్మా. అతనికిష్టమైనదే పెట్టండి" డాక్టర్ అన్నాడు.

"డాక్టర్ మీరు అంటున్నది"

"మొండివాడు రాజుకన్నా బలవంతుడమ్మా మంచో, చెడో అనుభవించే తెలుసుకుంటాడు"

నా మనస్సులో తళుక్కుమని ఒక ఆలోచన మెదిలింది. ఆ తర్వాత ఒక నిముషం కదా అక్కడ నిలబడలేదు. ఇంటికి పరుగెత్తాను. హాయిగా ఆనందంగా...

రాఘవీన్ కోకిల, నవంబర్, 1996